హోరెత్తిన ఎన్నికల ప్రచారం

లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో ముమ్మరంగా సాగుతోంది. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బరిలో ఉన్న ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు రెండు నియోజకవర్గాల పరిధిలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ప్రచారంలో ప్రత్యర్థులపై ఆరోపణలు, విమర్శలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

– ముషీరాబాద్, అంబర్‌పేట


బడీ మసీద్ వద్ద ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: ముస్లింలకు రిజర్వేషన్లను రద్దు చేస్తామని బీజేపీ నాయకులు పేర్కొనడం రాజ్యాంగ విరుద్ధమని బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ అన్నారు. నిజమైన పేదలు ముస్లిం సామాజిక వర్గంలోనే అధికంగా ఉన్నారని 4 శాతం రిజర్వేషన్ తప్పనిసరిగా వారికి ఉండాల్సిందేనని అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌లోని బడీ మసీదు వద్ద స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి ముస్లిలను కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని పద్మారావు గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఒకసారి ఎంపీగా గెలిపించండి ఐదేండ్లు మీకు అండగా ఉంటూ సేవ చేస్తానన్నారు. ప్రజలతో నిత్యం మమేకమై వారికి అండగా ఉండే నాయకుడు కావాలా.. కేవలం టీవీలలో కనిపించే నాయకుడు కావాలా ఆలోచించి ఓట్లు వేయాలని సూచించారు. స్థానిక ఎంపీ కిషన్‌రెడ్డి ఏనాడు ప్రజా సమస్యలను పట్టించుకోలేదని, కనీసం నగర అభివృద్ధికి నిధులు కేటాయించలేదన్నారు. అధికార దాహంతో పార్టీలు మారేవారి కోసం మాట్లాడుకోవడం సమయం వృథా అని ఎద్దేవా చేశారు. అధికారం కోసం మరో పార్టీలోకి మారినా ఆశ్చర్యం లేదని దానం నాగేందర్‌ను ఉద్దేశించి అన్నారు. 25 ఏళ్లుగా ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా ప్రజా సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ముషీరాబాద్ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, మైనార్టీ నేతలు జునేద్‌బాగ్దాదీ, మహ్మద్ అలీ, సమర్, షరీఫ్‌ఉద్దీన్, బింగినవీన్ పాల్గొన్నారు.

ఇందిరాపార్కులో బీఆర్‌ఎస్...

కవాడిగూడ: సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ శుక్రవారం ఇందిరాపార్కులో వాకర్స్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ఎంపీగా కిషన్‌రెడ్డి చేసిందేమిలేదని, కిషన్‌రెడ్డికి ఓట్లు అడిగే నైతిక హక్కులేదన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే పద్మారావుగౌడ్‌ను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, సీనియర్ నాయకులు శివముదిరాజ్, మీడియాసెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, మాదేశి రాజేందర్ పాల్గొన్నారు.

పద్మారావుగౌడ్‌ను గెలిపించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సుందరయ్య పార్కులో లెల్ల ఉప్పలమ్మ అమ్మవారికి పూజలు చేసిన అనంతరం ఎల్ఐజీ, ఎంఐజీ, సూర్యానగర్, బాగ్‌లింగంపల్లి, పాలమూరు బస్తీ తదితర ప్రాంతాల్లో ఇంటింటా తిరిగి పద్మారావుగౌడ్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. నాయకులు అయిలినేని కిషన్ రావు, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తథ్యం

- సికింద్రాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం
- కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్


దానం నాగేందర్‌ను కలిసిన కృష్ణాగౌడ్

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం సంతరించుకుంటుందని, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంపై కాంగ్రెస్ జెండా ఎగిరి తీరుతుందని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ఈ నెల 13న జరిగే ఓటింగ్‌లో ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఓటు వేయబోతున్నారని స్పష్టం చేశారు. శుక్రవారం అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తొలుపునూరి కృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు దానం నాగేందర్‌ను కలిసి ఎన్నికల ప్రచార సరళి, ఓటింగ్ ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... అంబర్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి 50 వేల మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మైనార్టీలు, బీసీలు, అగ్రవర్ణ పేదలు కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు తెలుపుతున్నారని ఇది తన విజయానికి బాగా కలిసివస్తుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు బండ సూరి, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకే ప్రజాదరణ

నల్లకుంట: రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అంబర్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని సీపీసీసీ నాయకులు తెలిపారు. ప్రజల ఆశీస్సులతో సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ భారీ మోజారిటీతో విజయం సాధించడం ఖాయమని జోష్యం చెప్పారు. శుక్రవారం నల్లకుంట తిలక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన కట్టెల సుభాష్, టీపీసీసీ కార్యదర్శి అజయ్ కుమార్, పార్టీ ఎస్సీ సెల్ మాజీ చైర్మన పీబీ శ్యామ్‌రాజ్, ఎస్.హరినాథరెడ్డి, దేవిరెడ్డి విజితా రెడ్డి తదితరులు మాట్లాడారు. అంబర్‌పేట నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఒక సారి ఎంపీగా కేంద్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన జి.కిషన్‌రెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి శూన్యమన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా కిషన్ రెడ్డికి గుణపాఠం చెబుతారన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను ప్రజలు గుర్తుపట్టే పరిస్థితి లేదన్నారు. నాయకులు రాఘవేందర్ రావు, శరత్ ముదిరాజ్, ఎస్. గిరి, ముషీరాబాద్ నియోజక వర్గం నాయకులు జీఎస్. కేశవ్, గజ్జల సూర్యనారాయణ, శివకుమార్, డీకే. శ్రీనివాస్, గడ్డం రాజేష్, జీఎస్. దశరథ్, పులిరాజు పాల్గొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి

కాచిగూడ: ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని దేశ భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో వంద శాతం పోలింగ్ జరిగేలా విద్యావంతులు, యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వి.ప్రభాకర్‌రావు, లయన్ జె.రామరాజు, సి.లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరశురామ జయంతి


పరశురాముడికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం న్యూ నల్లకుంటలోని బ్రాహ్మణ హాస్టల్‌లో పరశురామ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన టీబీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సురేశ్‌చందర్‌రావు అక్కడ ఏర్పాటు చేసిన పరశురాముడి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. పరశురాముడు విష్ణుమూర్తి అవతారాలలో ఆరవవాడని చెప్పారు. పరశురాముడిని ఆదర్శంగా తీసుకోవాలని బ్రాహ్మణ విద్యార్థులకు సూచించారు. టీబీఎస్ఎస్ నాయకులు బి.కాంతారావు, పొన్నాడ సుబ్రహ్మణ్యం, హరినాథ్ రావు, ఎన్. ప్రకాశ్ రావు, కె.రామారావు, సీహెచ్. మురళీ కృష్ణ, నర్సింహా రావు, విశ్వేర రావు, గరిమెళ్ల రాధాకృష్ణ, కేఎల్ఎన్.ప్రసాద్, శ్రీహరి, బ్రాహ్మణ హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అక్షయ తృతీయ ప్రత్యేక పూజలు


న్యూరామాలయంలో సరస్వతి మాతకు పూజలు


శంకరమఠంలో హరిద్రగా దర్శనమిచ్చిన శారదాంబ

నల్లకుంట: అక్షయ తృతీయ సందర్భంగా నల్లకుంటలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. నల్లకుంట శంకర మఠంలోని శారదాంబ ఉదయం హరిద్రాగా దర్శనమిచ్చి భక్తులకు కనువిందు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యూనల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతీ మాతను పట్టు వస్త్రాలు, పూల మాలలు, బంగారు ఆభరణాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక పారాయణ చేశారు.

బీఆర్‌ఎస్‌వైపే ముస్లింలు: కాలేరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని మాజీ హోంమంత్రి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు మహమూద్ అలీ తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం అంబర్‌పేటలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు బీఆర్‌ఎస్ అండగా ఉండాలని కోరారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ... అంబర్‌పేటలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి, అభివృద్ధికి తాను ఎంతో చేయూతనిచ్చానని తెలిపారు. దశాబ్దాల కాలంగా శ్మశన వాటిక సమస్యను పరిష్కారించానని చెప్పారు. అంబర్‌పేటలో మైనార్టీలంతా తానకు అండగా ఉంటారని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఎన్నికల ఇంచార్జ్ దాసోజ్ శ్రవణ్‌కుమార్, కార్పొరేటర్లు విజయకుమార్‌గౌడ్, పద్మా వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతి రెడ్డి, ఎంఐఎం నాయకులు మొయీన్, నాయకులు అలీ, జాఫర్, అదూల్, అతీక్, అజహర్, అఫ్రోజ్‌పాటిల్, మొబిన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నేతలు



కాచిగూడ: సికింద్రాబాద్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరూ ఆపలేరని ఆ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. రోజురోజుకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరి మద్దతు ప్రకటిస్తున్నారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కేపీ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నేతలు, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ రావు, భువనగిరి ధన్‌రాజ్ యాదవ్, టీడీపీ బర్కత్‌పుర మాజీ అధ్యక్షుడు కుర్మ భిక్షపతి, తదితరులు దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ నేతలు బండ సూరి, రాజుగౌడ్, మధు, సత్యనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు 16 సీట్లు పక్కా


ప్రచారం చేస్తున్న ఉమ్మడి ఏపీ పీసీసీ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ శ్యామ్‌రాజ్

నల్లకుంట: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 16 సీట్లు కైవసం చేసుకుంటుందని ఉమ్మడి ఏపీ పీసీసీ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ జి.బిశ్యామ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని చెప్పారు. సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంట తిలక్‌నగర్‌లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, నాయకులు ఎస్.హరినాథ్ రెడ్డి, దేవిరెడ్డి విజితా రెడ్డి, జీబీ. రఘు, ఎన్. గిరి, సీహెచ్. మురళీ కృష్ణ, గడ్డం రమేష్, సి. హరినాథ్, సురేందర్ గౌడ్, ఎం. మధు, జే. మనోహర్, ఎం. శివ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే ఆర్యవైశ్యులకు గుర్తింపు


మాట్లాడుతున్న కల్వ సుజాత

నల్లకుంట: కాంగ్రెస్ పాలనలోనే బ్రాహ్మణ, ఆర్యవైశ్యులకు సముచిత గుర్తింపు, గౌరవం లభించిందని ఆర్యవైశ్య కార్పొరేషన చైర్మన్ కల్వ సుజాత అన్నారు. శుక్రవారం తిలక్‌నగర్ చౌరస్తా సమీపంలోని ఓ హోటల్‌లో బ్రాహ్మణ, ఆర్యవైశ్య ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కల్వ సుజాత మాడుతూ... దివంతగ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నాటి ఆర్థిక మంత్రి కొణిజేటి రోశయ్య సహకారంతో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవీ మాత ఆలయాలను ఎండోమెంట్ నుంచి తొలగించి స్వయం ప్రతిపత్తిని కల్పించారని గుర్తుకు చేశారు. ఏనాడూ పేదల సంక్షేమాన్ని పట్టించుకోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఓట్ల కోసం రాముడి పేరుతో రాజకీయాలు చేస్తుందన్నారు. బ్రాహ్మణ, ఆర్యవైశ్య ఐక్య వేదిక కన్వీనర్‌లు పొన్నాడ సుబ్రహ్మణ్యం, విశ్వేశ్వర రావు, సి.హెచ్. మురళీకృష్ణ, బి.కాంతారావు, శ్రవణ్ కుమార్‌గుప్తా మాట్లాడారు. సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు బ్రాహ్మణ, ఆర్యవైశ్యులు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు.

ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి


నివాళులర్పిస్తున్న వీరశైవ లింగాయత్ నేతలు

కవాడిగూడ: సమసమాజ స్థాపన కోసం అనేక సంవత్సరాల క్రితమే మహాత్మా బసవేశ్వర కృషి చేసినట్లు వీరశైవ సమాజ్ సికింద్రాబాద్ అధ్యక్షుడు మాడపు వీరమల్లేష్, ప్రధాన కార్యదర్శి కోట గుండప్ప పేర్కొన్నారు. కర్ణాటకలో అనుభ మండపం నిర్మాణం చేపట్టి అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినట్లు తెలిపారు. అనుభవ మండప నిర్మాణ స్ఫూర్తితో భారత పార్లమెంటు నిర్మాణం జరిగిందన్నారు. మహాత్మా బసవేశ్వర 891వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వీరశైవ సమాజ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న మహాత్మా బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అనేక సంవత్సరాల క్రితమే మహాత్మా బసవేశ్వర లింగా, వర్ణ బేధం లేకుండా అందరూ సమానమే అంటూ ప్రచారం చేశారని తెలిపారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోని నేటి పాలకులు పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకొని జయంతి వేడుకలను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ నేతలు ఆర్ విశ్వేశ్వరయ్య, హనుమంతు, బద్రిఈశ్వరప్ప, గౌరీశంకర్, శివకుమార్, లింగం, వి.రాజేశ్వర్, వీరశైవ లింగాయత్ నేతలు పాల్గొన్నారు.

అంబర్‌పేట ప్రజల అండ తనకే: కిషన్‌రెడ్డి


అంబర్‌పేటలో ర్యాలీ వెళ్తున్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: అంబర్‌పేట ప్రజల ఆశీర్వాదంతోనే తాను రాజకీయంగా ఎదిగానని మారో మారు ఎన్నికల్లో తనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కేంద్రమంత్రి, బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞాప్తి చేశారు. అన్ని వేళల అంబర్‌పేట ప్రజలు తనకు అండగా ఉన్నారని వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. గురువారం రాత్రి బైక్ ర్యాలీతో నియోజకవర్గాన్ని చుట్టేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని ప్రాంతాలను తిరుగుతూ పలకరిస్తూ భారీ మెజార్టీ ఇవ్వాలని ఆయన కోరారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్నాయని అందరూ అప్రమత్తంగా ఉండి బీజేపీకి ఓటు వేయాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసపూరిత మాటాలు నమ్మవద్దని ఆయన తెలిపారు. ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముషీరాబాద్ కాంగ్రెస్ అడ్డా...

మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గోవింద్ తదితరులు

కవాడిగూడ: ముషీరాబాద్ గడ్డా కాంగ్రెస్‌కు అడ్డా అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని గంగపుత్ర ఆత్మీయ సమ్మేళన సభను ఆలిండియా కాంగ్రెస్ సీనియర్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభలో ముషీరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సరితాగోవింద్ భర్త బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జి.గోవింద్ ఆధ్వర్యంలో వంద మంది బీఆర్‌ఎస్ నాయకులు అంజన్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వం అని రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఉన్నత పదవులు లభించేలా కృషి చేస్తామన్నారు. గోవింద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపుకు గంగపుత్రులంతా ఐక్యంగా కృషి చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, బి-బ్లాక్ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు వెంకటేష్, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

కులగణనతోనే బలహీనవర్గాలకు న్యాయం: దానం

కవాడిగూడ: దేశ వ్యాప్తంగా కులగణన జరిగినప్పుడే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని సికింద్రాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని అందారా హాల్‌లో పద్మశాలి ఆత్మీయ సమ్మేళన సభ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సుదేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపట్టి అట్టడుగు వర్గాలకు న్యాయం చేసేందుకు రాహుల్‌గాంధీ సిద్ధంగా ఉన్నారన్నారు. కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి ఐదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు చేసింది ఏమీలేదని విమర్శించారు. కనీసం ఆయన నియోజకవర్గంలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు సైతం పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు. దీనిని బట్టి ఆయన పనితీరు ఎలా ఉందో అర్థమవుతుందని అన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే మీ ఓటు వృథా అవుతుందన్నారు. పద్మశాలీలకు భవన నిర్మాణానికి స్థలం కేటాయించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు. మాజీ ఎంపీలు అంజన్‌కుమార్ యాదవ్, అజహరుద్దీన్, యువజన కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి అరవిందు కుమార్ యాదవ్, పద్మశాలి సంఘం నాయకులు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, చంద్రమౌళి, సుభాష్, గుర్రం శంకర్, బోనం ఊర్మిల తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని రక్షించే నాయకులను ఎన్నుకోవాలి

సాధుసంతులు, స్వామీజీల పిలుపు

హిమాయత్‌నగర్: లోకసభ ఎన్నికలలో హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉండే నాయకులకి ఓటు వేయాలనీ సాధుసంతులు పిలుపునిచ్చారు. సనాతన హైందవ ధర్మ సంరక్షకులు, సాధుసంతులకు, మఠాధిపతులు, పీఠాధిపతులకు అండదండగా నిలబడే వారిని ఎన్నికలలో ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వామీజీలు మాట్లాడారు. రాజకీయ నాయకులు పోటీపడి హిందూ ధర్మాన్ని అపహాస్యం చేస్తున్నారని, హిందూ ధర్మ పరిరక్షకులపై దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను సమష్టిగా తిప్పి కొట్టాలంటే ధర్మానికి అండగా నిలబడే సమర్థవంతమైన నాయకులనే ఆదరించాలనీ హిందూ సమాజానికి పిలుపునిచ్చారు. రాజకీయ నాయకుల ప్రలోభాలకు లొంగకుండా, ప్రజాస్వామ్యంలో ఓటును ఉపయోగించి హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలన్నారు. సమావేశంలో సుదర్శన స్వామీజీ, బ్రహ్మశ్రీ బెనారస్ గురూజీ, మాత పద్మజానంద, విజయ ప్రతాప్ మహారాజ్, గురూజీ జగన్నాథశాస్త్రి, వెంకటేశ్వర ఆచార్య, కాంతేంద్ర స్వామీజీ, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు భోజనపల్లి నరసింహమూర్తి, శాలివాహన పండరినాథ్ , రామరాజు, పగుడాకుల బాలస్వామి, జగదీశ్వర్, సుభాష్ చందర్, శివ రాములు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న స్వామీజీలు

నిమ్స్ నర్సులు కూడా నర్సింగ్ ఆఫీసర్లే

- సంచాలకుడు ప్రొఫెసర్ నగరి బీరప్ప
- ఘనంగా అంతర్జాతీయ నర్సెస్ దినోత్సవం

లక్డీకాపూల్: నిజామ్ వైద్య విజ్ఞాన సంస్థలో రోగులకు వైద్య సేవలను అందిస్తున్న నర్సులు కూడా ఇక నర్సింగ్ ఆఫీసర్లుగా పరిగణింపబడతారని సంచాలకుడు ప్రొఫెసర్ నగరి బీరప్ప వెల్లడించారు. శుక్రవారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో అంతర్జాతీయ నర్సెస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించా. నిమ్స్ నర్సింగ్ యూనియన్ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం నిమ్స్ నర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో నిమ్సా అంతర్జాతీయ నర్సెస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిమ్స్ టైమ్స్ మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డీన్ డాక్టర్ లిజ రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్,, అసోసియేట్ డీన్ డాక్టర్ నాగేశ్వరరావు, యూనియన్ అధ్యక్షురాలు ఆశలత, ప్రధాన కార్యదర్శి ఎస్. విజయ కుమారి పాల్గొన్నారు. నర్సులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆర్.కృష్ణయ్యపై దాడి హేయం

దోషులను కఠినంగా శిక్షించాలని రాంగోపాల్ యాదవ్ డిమాండ్


మాట్లాడుతున్న రాంగోపాల్ యాదవ్

కవాడిగూడ: బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యపై దాడి జరగటం హేయమైన చర్య అని నిందితులను కఠినంగా శిక్షించాలని బీసీ లిబరేషన్ టైగర్‌ఫోర్స్ జాతీయ అధ్యక్షులు రాంగోపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. బీసీల హక్కుల కోసం గత 40ఏండ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంగోపాల్ యాదవ్ మాట్లాడుతూ ఆర్. కృష్ణయ్యపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాళహస్తీ నియోజకవర్గం ఏర్పేడులో బండరాయితో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడం సహించరానిదన్నారు. తరతరాల బానిసత్వానికి బలైపోతున్న బీసీల జీవితాలలో మార్పు కోసం ఆర్. కృష్ణయ్య ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బీసీలకు విద్య, ఉపాధి, ఉద్యోగాల కోసం తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వాలపై నిరంతరం పోరాడుతున్నారన్నారు. ఈ దాడి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనుసన్నల్లో జరిగిందని, 48 గంటల్లో దాడికి పాల్పడిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో రెండు తెలుగు రాష్ట్రాలలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ లిబరేషన్ టైగర్‌ఫోర్స్ జాతీయ ఉపాధ్యక్షులు వేణుమాధవ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో వచ్చేది ఇండియా కూటమే..

ఫిలింనగర్: కేంద్రంలో ఈ సారి ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఏఐసీసీ స్పోక్స్ పర్సన్, ఏఐసీసీ కమ్యూనికేషన్ కో ఆర్డినేటర్ సుజాత పాల్ అన్నారు. శుక్రవారం ఆమె ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్ కాలనీ, మాగంటి కాలనీల్లో కాంగ్రెస్ నేత, అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇచ్చే గ్యారంటీ పథకాలపై స్థానికులకు వివరించారు. కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ నేతలు చెప్పే గారడి మాటలు విని మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నేత బి.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు

- అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం

హిమాయత్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి గెలిపించుకుంటామని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గుంజా శ్రీనివాస్ ప్రకటించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గుంజా శ్రీనివాస్ మాట్లాడుతూ... వడ్డెర్లు విద్య, సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా పూర్తిగా వెనుకబడి ఉన్నారన్నారు. ఎస్టీల్లో చేర్చకుండా బీసీ కులజాబితాలో వడ్డెర్లని బీసీ(ఏ) గ్రూప్‌లో చేర్చడం వల్ల అన్నివిధాలా నష్టపోతున్నారన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్టీ జాబితాలో చేర్చి, వడ్డెరల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలని గుంజ శ్రీనివాస్ ఆకాంక్షించారు. జాతీయ ఉపాధ్యక్షులు కుంచాల వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటేష్, గ్రేటర్ అధ్యక్షులు రేపని గిరిబాబు, కార్మిక విభాగం అధ్యక్షుడు ఎస్.గోపాల్, జాతీయ మహిళా అధ్యక్షురాలు వి. తిరుమలాదేవి పాల్గొన్నారు.